క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఇరిగేషన్ ఈఈ



ఎమ్మెల్యే సంజీవయ్యను కలిసి శాలువ కప్పి సత్కారించిన ఈఈ రత్నా రెడ్డి

నాయుడుపేట : ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను బుధవారం గూడూరు ఇరిగేషన్ ఈఈ రత్నారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. ఆత్మకూరు ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

రాపూరు : ప్రభుత్వం అందజేస్తున్న సరుకులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని డీటీ సురేఖ ఆదేశించారు. ఆమె బుధవారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచే షాపును తెరవాలని, ప్రతి రోజూ 150 నుంచి 200 మందికి సరుకులు పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు అందజేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే డీఎస్‌వో కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆర్‌ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్ సిబ్బందికి వీడ్కోలు



బెటాలియన్ సిబ్బందికి వీడ్కోలు పలుకుతున్న కమాండెంట్ పి.ప్రకాష్

సైదాపురం(వెంకటగిరి) : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సుమారు 25 మంది సిబ్బంది ఏపీఎస్పీ బెటాలియన్స్ 2, 3, 6, 11, 14వ బెటాలియన్‌లకు బదలీ అయ్యారు. వారిని బెటాలియన్ కమాండెంట్ పి ప్రకాష్ ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం పోలీసు డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ మనోహర్, రామకృష్ణ,ఏవోచంద్రమౌళి, డాక్టర్ శేషమ్మ పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో గూడూరు బాలిక ప్రతిభ



లక్ష్మీసిరి

గూడూరు రూరల్ : చెన్నైలో బుధవారం జరిగిన ఖేలో ఇండియా టోర్నమెంట్‌లో గూడూరు పట్టణానికి చెందిన దండు మహేష్‌రెడ్డి కుమార్తె లక్ష్మీసిరి ప్రతిభ చూపింది. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది. ఖేలో ఇండియా పోటీలకు కళాశాల తరఫున ఎంపికైంది. చెన్నైలో జరిగిన టెన్నిస్ సింగిల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. ఆమె ఇండియాలో అండర్–18 విభాగంలో 3వ ర్యాంకు, ప్రపంచ ర్యాంకింగ్‌లో 385వ ర్యాంకు సొంతం చేసుకుంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



గూడూరు రూరల్ : ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గూడూరు నియోజకవర్గం నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. తిరుపతిలో జిల్లా స్థాయిలో బుధవారం నిర్వహించిన వాలీబాల్ ఫైనల్స్‌లో గూడూరుకు చెందిన మెప్మా సచివాలయం జట్టు, చంద్రగిరి నియోజకవర్గ జట్టుతో తలపడి విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. వారిని ఆడుదాం ఆంధ్రా కోఆర్డినేటర్ శివకుమార్ అభినందించారు. రూ.60 వేలతోపాటు పాటు ట్రోఫీ అందజేశారు. ఫిబ్రవరి 6న వైజాగ్‌లో జరిగే పోటీలకు ఎం.అనూష, జ్యోతి, దీనా, స్నేహ, మల్లేశ్వరమ్మ, సాయిస్వప్న, అస్మ ఎంపికయ్యారు.

పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన చేస్తున్న ఇండోఫిల్ ప్రతినిధులు

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామంలో బుధవారం పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇండోఫిల్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం వరిని ఆశిస్తున్న సుడిదోమ, అగ్గితెగులు, మెడవిరుపు తెగుళ్ల నివారణకు స్కైస్టార్, మెర్జన్ మందులు ఎంతో బాగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో డీజీఈ సతీష్‌కుమార్, సిబ్బంది శివ, రవితేజ, బాబు, సతీష్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 11.942 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.942 టీఎంసీల నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 210 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా సాధికారతే సీఎం జగనన్న లక్ష్యం



వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



సభకు హాజరైన మహిళలు

- వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించండి
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ

వెంకటగిరి రూరల్ : మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీతవో కార్యాలయంలో బుధవారం వెంకటగిరి రూరల్ మండలానికి సంబంధించి పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ చేశారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4వ విడత ఆసరా నిధులు మంజూరుచేశారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న సువర్ణ పరిపాలను చూసి ఓర్వలేని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, పచ్చమీడియా దుష్ప్రచారం చేస్తున్నట్లు మండిపడ్డారు. చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్‌బాబు ఎక్కడ ఉంటే అక్కడ వర్షాలు కురవక కరువు తాండవిస్తోందని, ఇది జగమెరిగిన సత్యమన్నారు. అదే వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సకాలంలో వర్షాలు కురవడంతో పాటు పాడి పంటలు సక్రమంగా పండి రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. వెంకటగిరిని అభివృద్ధి చేయాలని ఆనం రామనారాయణరెడ్డికి అవకాశం ఇస్తే ప్రజలను మోసం చేశారని తెలిపారు. మంత్రి పదవి ఇవ్వలేన్న అక్కసుతో ఆదరించి ఎమ్మెల్యే సీటు ఇచ్చి గెలిపించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం ఆనం నైజమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాను నిలవనున్నానని, ప్రజలు అంతా అండగా ఉండి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సారి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు వెంకటగిరిని అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కనీ్వనర్ ఎం.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగయ్య, వైస్ ఎంపీపీ పెంచలయ్య, నాయకులు సదారెడ్డి, కంచి గురుప్రసాద్, తిరుమల, రాజారెడ్డి, భాస్కర్, సర్పంచ్ ప్రమీల, సక్కుబాయమ్మ, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుపై సీఎం ప్రత్యేక దృష్టి



అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సాయికృష్ణయాచేంద్ర, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి, ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర
- ఘనంగా ఏపీ మోడల్ స్కూల్ డే
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వెంకటగిరి రూరల్ : పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీబీసీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్, భారతమాత విగ్రహాలను ఆవిష్కరించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి కార్పొరేట్ దీటుగా డిజిటల్ తరగతులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు, యూనిఫారం, బ్యాగులు, పుస్తకాలు, షూ అందజేస్తున్నట్టు చెప్పారు. అమ్మ ఒడి ద్వారా పిల్లల తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తున్నట్టు వివరించారు. వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు, ఎస్వీబీసీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర్య సమర యోధులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యలో ప్రతిభన కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతుశారద, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కేవీకే శాస్త్రవేత్త బి.గోవిందరాజులు, ఎంఈవో–2 బాబయ్య, పి.లక్ష్మి, కౌన్సిలర్లు శంకరయ్య, వహిద, కళ్యాణి, ప్రభావతి, 24వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండెంట్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్



దక్కిలి: ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామ్‌గోపాల్

బాలాయపల్లి (డక్కిలి): మండలంలోని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు యాచవరం గ్రామంలో నిర్వహించిన క్యాంపు బుధవారం ముగిసింది. ఈ క్రమంలో యాచవరం గ్రామంలో మురుగు కుంటలను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. పాఠశాలను శుభ్రం చేశారు. బస్సు షెల్టర్ దగ్గర విద్యుత్ వైరింగును సరిచేసి ట్యూబ్ లైట్లు వేశారు. ప్రిన్సిపాల్ రామ్‌గోపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ క్యాంప్ ముగింపు సందర్భంగా వెంకటగిరికి చెందిన దంత వైద్యులు సుమన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.మునీంద్ర, ఉప సర్పంచ్ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్ సేవలు అనిర్వచనీయం



హెచ్ఎం కోదండరామ్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ డీఈవో, ఉపాధ్యాయులు

చిల్లకూరు : విద్యాశాఖలో 30 ఏళ్లుగా వివిధ విభాగాల్లో పనిచేసిన కోదండరామ్ సేవలు అనిర్వచనీయమని డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కోదండరామ్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సనత్‌కుమార్, రఫూఫ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు సన్మానం

సైదాపురం : స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మన్నెం సుబ్బమ్మ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ఏప్రిల్ 2 నుంచి 5 వరకు జరిగే జాతర సందర్భంగా తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు బుధవారం వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాది కన్నా ఈ సారి రూ.63 వేలు అధికంగా ఆదాయం వచ్చినట్లు ఆలయ ట్రస్టు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ తెలిపారు. మిగిలిన వాటికి మరోసారి వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ సింహాద్రి మనోహర్, ట్రస్టు సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, ఉప్పాల ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

చిల్లకూరు(చిట్టమూరు) : తుపాను సమయంలో ఇబ్బందులు పడిన పేదలకు క్రైస్తవ సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవడం అభినందనీయమని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. గుంటూరుకు చెందిన క్రైస్ట్ ఇవాంజికల్ లూథరన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం చిట్టమూరు మండలంలో తుపాను బాధితులు సుమారు 500 మందికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ తుపాను సమయంలో అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేదలకు సహాయం చేశారని తెలిపారు. క్రైస్ట్ మినిస్ట్రీస్ బిషప్ కూరపాటి విజయకుమార్, ఎంపీడీవో షాలేట్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, కోశాధికారి గడ్డం హానోక్ పాల్గొన్నారు.

కొత్త కమిషనర్‌గా జనార్ధన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ కొత్త కమిషనర్‌గా ఎం.జనార్ధన్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాజంపేట మున్సిపాలిటీలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కమిషనర్‌ను మున్సిపల్‌మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, సిబ్బంది శాలువాలుకప్పి సత్కరించి స్వాగతించారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్

నూతనంగా బాధ్యతలను చేపట్టిన కమిషనర్ జనార్ధన్ రెడ్డి బుధవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అదే విధంగా కమిషనర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు కె.మాధవరెడ్డి, కె.మోహన్‌రెడ్డి, కె.జయరామయ్య, జి.సిద్ధయ్య, చంద్రారెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ రహంతుల్లా తదితరులు అభినందించారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

బాలాయపల్లి (డక్కిలి) : బాలాయపల్లి సచివాలయం వద్ద గురువారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కులు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ప్రమీలారాణి తెలిపారు. ఇందులో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ, పొదుపు మహిళలు పాల్గొనాలని కోరారు.

నేడు సైదాపురం మండల మీట్

సైదాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

3న మండల సర్వసభ్య సమావేశం

దక్కిలి: ఈ నెల 3వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసన్న కుమారి తెలిపారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందని, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీల అధ్యక్షులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నాయుడుపేట టౌన్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న కుదిరి రమణయ్యను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. పట్టణంలో మంగళవారం రాత్రి గస్తీ తిరుగుతుండగా ఎల్‌ఏ సాగరం బీడీ కాలనీకి చెందిన రమణయ్య అనుమానస్పదంగా వెళుతుండడంతో తనిఖీ చేశామన్నారు. అతని వద్ద నున్న సంచిలో 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రేపు నరసింహస్వామికి చందనాలంకరణ



రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి శుక్రవారం చందనాలంకరణ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యపై టీడీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ నాయకుడు పాపాడి రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ చేయని విధంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్

కోట: తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో మరింత బాధ్యతగా పనిచేయాలని అధికారులకు సూచించారు. సచివాలయాల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న 25 దుకాణాలను కోట పంచాయతీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చిందని, వాటికి బహిరంగ వేలం వేస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి కోరారు. అదేవిధంగా విద్యానగర్, ప్రకాశంకాలనీలో జనావాసాల మధ్య విద్యుత్ లైన్లు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా కొత్తపాళెం, నెల్లూరుపల్లి, పల్లమాల, అగ్రహారం గ్రామాల్లో భూములు కోల్పోయిన వారిలో చాలా మందికి నష్ట పరిహారం అందలేదని ఫిర్యాదు చేశారు. ఉత్తమనెల్లూరు నుంచి సిద్ధవరం వరకు తుపాను కారణంగా దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తు కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వాణి, డీఎల్‌పీవో వెంకటరమణ, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవానీ పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు సజ్జలను కలిసిన మేరిగ మురళీధర్



సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలసిన మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ బుధవారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గూడూరు నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర వివరాలను తెలియజేశారు. నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీ పరిస్థితి, విజయవకాశాలను వివరించారు. త్వరలో నియోజకవర్గంలో కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రజా ప్రతినిధులతో మరోసారి ఆత్మీయ సమావేశం నిర్వహించి బూత్ కన్వీనర్ల నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అందరిని కలుపుకుని పోవాలని మేరిగకు సజ్జల రామక్రిష్ణారెడ్డి సూచించారు.

ఆర్యవైశ్య సంఘం నేతకు ఎమ్మెల్యే పరామర్శ



శ్రీకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులు

నాయుడుపేట టౌన్ : ఆర్యవైశ్య యువజన విభాగం నేత దేవత శ్రీకర్‌ను బుధవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. శ్రీకర్ తండ్రి దేవత గోపీకృష్ణ(55) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్టణంలోని ఆంధ్రా బ్యాంక్ వీధిలో ఉన్న శ్రీకర్ నివాసం వద్దకు వెళ్లి గోపీకృష్ణ భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకర్‌ను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టి.సుబ్రమణ్యం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ టి.జనార్ధన్ రెడ్డి, నాయకులు జయరామయ్య, రవి, సీహెచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



దక్కిలి: ఎంపీడీవోను సన్మానిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

దక్కిలి : చిత్తూరుకు బదిలీ అయిన ఎంపీడీవో ప్రసన్నకుమారిని బుధవారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. సూపరింటెండెంట్ అనురాధ, సీనియర్ సహాయకులు సిరాజ్, జూనియర్ అసిస్టెంట్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు : స్థానిక ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పనిచేస్తున్న ముక్రంబాక జార్జి, నలగామల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయరాలు నిర్మలకుమారి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంఈవో నసీంఅలీ, హెచ్ఎం ప్రవీణ్ కుమార్, నాయకులు దామోదర్‌రెడ్డి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: కడప జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో రజనీకాంత్‌ను బుధవారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో రజనీకాంత్ మండలంలో పనిచేసిన అనతికాలంలో మంచి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలుపుగోలుగా ఉంటూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసూన, ఈవోపీఆర్డీ మోహన్, ఏపీవో ఉషారాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చందుకుమార్, సిబ్బంది రవి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వాకాడు: ఆర్టీసీ ఉద్యోగిని సత్కరిస్తున్న నేతలు



ఓజిలి: ఎంపీడీవో రజనీకాంత్‌ను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



ఉపాధ్యాయులతో సమావేశమైన డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి

ఓజిలి: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయుల పనితీరు పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలో విద్యార్థుల ఉత్తీర్ణతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం సబ్జెక్ట్ పరిశీలకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, సీనియర్ ప్రధానోపాధ్యాయులు పి.కోటేశ్వరయ్య, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, జమ్ముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.